హైదరాబాద్ వార్త



# నేడే జూబ్లీ అభ్యర్థుల భవితవ్యం

**-ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం**
**-ఒక్కో రౌండ్‌కు 45 నిమిషాలు**
**-అన్ని ఏర్పాట్లు పూర్తి : ఆర్వో కర్ణన్**
**- కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ**



వివరాలు వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి ఆర్వో కర్ణన్, చిత్రంలో తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

**జూబ్లీహిల్స్, నవంబరు 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీపడిన ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ ఉంది. గురువారం ఉదయం 8 గంటలకు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం(14న) ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తాం. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్న నేపథ్యంలో ప్రత్యేక అనుమతి తీసుకొని లెక్కింపుకు 42 టేబుళ్లు ఏర్పాటుచేశాం. 10 రౌండ్లలో కౌటింగ్ పూర్తిచేస్తాం. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని ఏర్పాటుచేశాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు వారి ఏజెంట్లకు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఇతరులకు ప్రవేశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని ఇందుకోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. డీఈర్సీ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. అనుమతి ఉన్నవారే కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు తీసుకొంటామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం. విజిలెన్స్ అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం



స్ట్రాంగ్ రూం వద్ద సాయుధ పోలీసుల పహారా

### ఒక్కో రౌండ్‌కు 45 నిమిషాలు

ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులకు ఇప్పటికే తుది విడత శిక్షణను ఇచ్చారు. ఉదయం 5 గంటలకు అభ్యర్థుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి స్ట్రాంగ్ రూం తలుపులు తెరిచి లోపలికి వెళ్లి ఈవీఎంలపై ఉండే సీళ్లు, ఇతర భద్రతా ఏర్పాట్లను సరిచూస్తారు. అనంతరం ఓట్ల లెక్కింపు కేంద్రానికి వస్తారు. ఒక్కో రౌండ్ ఓట్ల లెక్కింపుకు దాదాపు 45 నిమిషాలు సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తం ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలలోగా పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మొదటి రెండు, మూడు గంటల్లోనే ఫలితం ఊహించే విధంగా ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.

### లెక్కింపు ఇలా..

**తొలుత లెక్కింపు:** పోస్టల్ బ్యాలెట్(దాదాపు 700కుపైగా పోస్టల బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. డివిజన్ల వారీగా లెక్కింపు ఇలా..: షేక్‌పేట, ఎర గ్రడ్డ(సగం బూత్‌లు), రహ్మత్‌నగర్, వెంగళ్‌రావు నగర్, యూసుఫ్ గూడ, సోమాజీగూడ, బోరబండ, ఎర్రగడ్డ (మిగిలిన బూత్‌లు).

# అమ్మప్రేమకు దూరంగా..!

**-ఉద్యోగ ఒత్తిళ్లతో పిల్లలకు దూరమవుతున్న పేరెంట్స్**
**-పిల్లల కేర్ కోసం' డేకేర్‌లలో వేస్తున్న వైనం**
**-పూర్తిస్తాయిలో ప్రేమ పంచలేకపోతున్న తల్లిదండ్రులు**



**హైదరాబాద్, నవంబర్ 13,ప్రభాతవార్త;** నగరంలో రోజు రోజుకి డేకేర్ కల్చర్ పెరుగుతుంది. చాలా కుటుంబాలలో భార్యభర్తలు ఉద్యోగ రిత్యా ఒత్తిళ్లతో వారి పిల్లలకు దూరమవుతున్నారు.ముఖ్యంగా ఐటీ, టీచింగ్,ఇతర ప్రైవేట్ రంగాలలో పనిచేసే ఉద్యోగులు పిల్లల పరిస్థితి దీనంగా మారింది. చాలా మంది సాధారణ, మధ్యతరగతి కుటుంబాలలో భార్యభర్తలు ఇద్దరు ఉద్యోగం చేస్తే తప్ప జీవనయానం ముందుకు సాగలేని పరిస్థితి ఉంది. ఉదయం లేవగానే వారు హడవుడిగా రెడీఅయ్యి తమ కార్యాలయాలకి వెళ్ళిపోతుంటారు. ఈ బిజీలో వారి పిల్లల ఆలనపాలన చూసుకోవటం కష్టతరంగా మారడంతో, చాల మంది 'డేకేర్' సెంటర్లలో వేస్తున్నారు. మరికొందరు పిల్లలను చూసుకోవడానికి ఇంట్లోనే ఆయాలను పెట్టుకుంటున్నారు. కొంత మంది... బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో విడిచిపెట్టి ఆఫీసులకు వెళ్ళిపోతున్నారు.తల్లిదండ్రులు సాయంత్రం ఆఫీస్ నుంచి తిరిగి వచ్చేటపుడు పిల్లలను తెచ్చుకుంటున్నారు. అప్పటికే ఉదయం నుంచి ఆఫీస్‌లో అలసిపోయిన పేరేంట్స్ ఇంటికి వచ్చాక పిల్లలను పట్టించుకునే పరిస్థితి కపిపించడంలేదు. ఏదో ఒకటి తినిపించి పిల్లలను పడుకోపెడుతున్నారు. దాంతో పిల్లలకి, తల్లిదండ్రులు ప్రేమ అనురాగాలు పంచలేపోతున్నారు. సెలవు దినంలో కూడా ఆఫీస్‌కు సంబంధించిన ఏదో ఒక ఫెండింగ్ వర్క్ చేసుకుంటూ పనిలో నిమగ్నమవుతున్నారు. ఆ రోజు కూడా పిల్లలతో సరైన సమయాన్ని కేటాయించలేని తల్లిదండ్రులు నగరంలో చాలా మంది ఉన్నారు.ఈ విధంగా తల్లిదండ్రులు పిల్లలకు దూరంగా ఉండటం వలన వారి మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని నిపుణులు తెలుపుతున్నారు. పేరెంట్స్ పిల్లలతో గడిపే సమయాన్ని బట్టే పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంపొందించటం, ఒంటరితనం పోగొట్టడానికి దోహదం చేస్తాయని పలు అధ్యాయనాలు చెబుతున్నాయి. చిన్నప్పుడు ఈ విధంగా పెరిగిన పిల్లలు, పెద్దయ్యాక చెడు వ్యసనాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందని పలువురు సీనియర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### తల్లిదండ్రులకు నిపుణుల సూచనలు..

-ఎన్ని పనులున్నా... తల్లిదండ్రులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడిపేందుకు కేటాయించాలి.

-ప్రతిరోజూ పిల్లలతో కలిసి భోజనం చేసే ప్రయత్నం చేయ్యాలి.

-సెలవు రోజున తమ పనులను త్వరగా ముగించుకొని, పిల్లలను బయటకు తీసుకెళ్తుండాలి. అప్పుడే పిల్లలలో ఒంటరి అనే భావన తొలగిపోతుంది.

-పిల్లలను తరచూ కంప్యూటర్లు, ఫోన్లు, టీవిలకే పరిమితం చేయకుండా, అప్పుడప్పుడు ఆట మైదానాలలోకి తీసుకువెళ్లి ఆడిపిస్తూ ఉండాలి.

-పిల్లలు మారం చేసినా...తల్లిదండ్రులే స్వయంగా తినిపించటం వలన వారికి సంపూర్ణ ఆరోగ్యం, ఉత్తేజం లభిస్తుంది.

-ప్రతిరోజూ వీలైనంతం ఎక్కువసేపు పిల్లలతో మాట్లాడుతుండాలి. దాంతో పిల్లల మెదడు చురుకుగా పనిచేస్తుంది.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్. పోలీసులు

**కంటోన్మెంట్,నవంబర్ 13 ప్రభాతవార్త:** దేశ రాజధానిలోని ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్ల నేపథ్యంలో రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జి.అర్.పి, ఆర్.పి. ఎఫ్,బాంబుడాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. వివిధ రైళ్ల నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్నా, పోతున్నా ప్రయాణికుల బ్యాగ్‌లను, షూట్‌కేసు లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్.పి.ఎఫ్, ఐపిఎఫ్ అధికారి పి.ఎస్.సరస్వత్, జి.ఆర్.పి.ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్, ఆర్. పి.ఎఫ్.ఎస్ఐలు ఎం.వెంకట్ రెడ్డి, రమేశ్, ఆర్.పి.ఎఫ్, జి.ఆర్.పి. ఎఫ్.పోలీసులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల గుట్టు రట్టు

**-4.75 లక్షల నకిలీ కరెన్సీ, కారు, 3 ద్విచక్ర వాహనాలు, 9 సెల్ ఫోన్ స్వాధీనం**



మెహిదీపట్నం పిఎస్‌లో వివరాలను వెల్లడిస్తున్న సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డిసిపి కృష్ణ గౌడ్.

**మెహిదీపట్నం, నవంబర్ 13, ప్రభాతవార్త :** నకిలీ నోట్లను చలామణి చేస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు మెహిదీపట్నం పోలీసులు. సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డిసిపి బి.కృష్ణ గౌడ్ గురువారం మెహిదీపట్నం పిఎస్ లో వివరాలను వెల్లడించారు. కోస్గిలోని గుండిమల్ గ్రామానికి చెందిన కస్తూరి రమేష్ (35)తన సోదరి రామేశ్వరితో కలిసి తాండూరులోని తన నివాసంలో నకిలీ 500 రూపాయల నోట్లను స్కానర్ సహాయంతో తయారు తయారుచేసి వివిధ ప్రాంతాలలో చలామణి చేసి అక్రమ డబ్బును సంపాదించేవాడు. ఈ క్రమంలో కస్తూరి రమేష్ ఇన్ స్టా గ్రామ్ లో తన ఫోన్ నెంబర్ తో ఓ వీడియో నూ తయారుచేసి పోస్ట్ చేశాడు.సులేమాన్ నగర్ కి చెందిన అబ్దుల్ వహీద్ (21) మొహమ్మద్ తహా (21) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా రమేష్‌ను సంప్రదించి అతని నుండి 1:4 నిష్పత్తిలో నకిలీ కరెన్సీ నోట్లను సేకరించడం ప్రారంభించాడు. కాగా వారిద్దరు 1అసలు నోటుకు 4నకిలీ నోట్లను తీసుకొని 1:3 నిష్పత్తిలో నకిలీ నోట్లను సులేమాన్ నగర్ కి చెందిన మొహమ్మద్ సోహైల్ (21) బహదూర్‌పురకు చెందిన మొహమ్మద్ ఫహద్ (23)లకు ఇచ్చేవాడు. కాగా సోహైల్ ఫహద్ 1:2 నిష్పత్తిలో కిషన్ బాగ్ కి చెందిన షేక్ ఇమ్రాన్ (23), కూకట్‌పల్లికి చెందిన ఒమర్ ఖాన్ లకు నోట్లను పంపిణీ చేసేవారు. ఈ క్రమంలో ఇమ్రాన్ మరియు ఒమర్ ఫస్ట్ లాన్సర్స్‌లోని ఈద్గాదర్గా వద్ద సయ్యద్ కిషన్ బాగ్ కి చెందిన అల్తమాష్‌తో (21) నకిలీ నోట్లను మార్పిడి చేసుకోవడానికి మంగళవారం రాత్రి ప్రయత్నిస్తుండగా సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వీరిని విచారించగా వారి వద్ద 950, 5వందల రూపాయల నోట్లతో పాటు, ఒక కారు, 3ద్విచక్ర వాహనాలు 9 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని గురువారం రిమాండ్‌కు తరలించారు. వీటి విలువ 4.75 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఆసిఫ్ నగర్ ఏసిపి కిషన్ కుమార్, మెహిదీపట్నం సీఐ ఎస్.మల్లేష్, సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి.సంతోష్ కుమార్, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఎస్.రాంబాబుతో పాటు మెహదీపట్నం పోలీస్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందించారు.

## జూపార్కులో జంతువులకు హీటర్లు ఏర్పాటు



పులులు ఎన్‌క్లోజర్ వద్ద హీటర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**చార్మినార్,నవంబరు 13 ప్రభాతవార్త :** చలి కాలం ప్రారంభం కావటంతో హైదరాబాద్ పాతబస్తీ బహదూర్ పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని జంతువులు, పక్షుల ఎన్‌క్లోజర్ వద్ద వేడి కోసం హీటర్లు,విద్యుత్ బల్బులు,గోనె సంచులు ఏర్పాటు చేశారు.జూ పార్కులో గురువారం ప్రారంభమైన ఏర్పాట్లు మూడు రోజులలోపూర్తి కానున్నాయని జూ పార్కు క్యూరేటర్ జె.వసంత తెలిపారు.జూ పార్కులో 194 జాతులకు చెందిన 2300పలు రకాల జంతువులు,పక్షులు ఉన్నాయి.చలి కాలం సందర్భంగా జంతువుల పరిరక్షణ కోసం జూ పార్కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.పులులు,సింహాలు.చిరుత పులుల ఎన్‌క్లోజర్లు వద్ద హీటర్లు ఏర్పాటు చేశారు.పలులు,సింహాలు,చిరుత పులులు వెచ్చదనం కోసం హీటర్ల వద్దకు వస్తున్నాయి.అదే విధంగా నైట్ ఎన్‌క్లోజర్లు వద్ద చల్లని గాలులు లోపలకు ప్రవేశించ కుండ ఎన్‌క్లోజర్లు చుట్టూ గోనె సంచులు కట్టారు.ఎన్‌క్లోజర్ లోపల జంతువులు నిద్ర పోయేందుకు చెక్క బల్లలు ఉంచారు.పాములు,బల్లులు ఉన్న ఎన్‌క్లోజర్లు ముందు విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు.జంతువులలో రోగ నిరోధక శక్తి పెరగడానికి జంతువులకు బి కాంప్లెక్సు ట్యాబ్‌లెట్లు,సిర్ఫ్‌లు ఆహారం,నీళ్లలో కలిపి అందజేస్తున్నారు.జూ పార్కులోని ఏనుగులకు దోమలు బెడద లేకుండ ఉండేందుకు వేప ఆకులను కాల్చుతున్నారు.చలి కాలం సందర్భంగా జూ పార్కులోని జంతువులు,పక్షుల పరి రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకున్నామని జూ పార్కు క్యూరేటర్ జె.వసంత తెలిపారు.

## కాచిగూడ రైల్వేబ్రిడ్జికింద కారు కలకలం

**బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేసిన పోలీసులు**



నింబోలిఅడ్డ రైల్వేబ్రిడ్జి కింద రోడ్డుకు అడ్డంగా నిలిపిన అనుమానిత కారు

**హైదరాబాద్, నవంబర్ 13,ప్రభాతవార్త:** కాచిగూడ నింబోలి అడ్డ వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి కింద రోడ్డుకు అడ్డంగా ఓ వ్యక్తి కారును పార్కు చేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. గురువారం సాయంత్రం సుమారు 7:30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి నింబోలి అడ్డ వద్ద ఉన్న రైలు ఓవర్ బ్రిడ్జ్ వద్ద రోడ్డుకు అడ్డంగా టిఎస్ 11యుఏ 7868 బూడిద రంగు కారుని నిలిపి వెళ్లిపోయాడు. స్థానికులు అనుమానంతో ఈ విషయాన్ని కాచిగూడ పోలీసులు తెలియజేశారు. దీంతో కాచిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎకారులో పేలుడు పదార్థాలు ఉన్నాయేమో అని వారు అనుమానంతో చాలా సేపటి వరకి ఎవరిని అక్కడికి వెళ్ళనీయలేదు బాంబ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు చేసిన తర్వాత కారులో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించి అనంతరం అక్కడి నుంచి తొలగించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు లేచిపోయి భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. కారు బాలాజీ అనే పేరుతో రిజిస్టర్ అయ్యి ఉన్నట్లు గుర్తించి పోలీసులు విచారించగా,కారు రెంట్‌కి ఇచ్చినట్టు యజమాని తెలిపారు.కాగా అక్కడ కారు నిలిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు.

# బాలికల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

**-మానసిక ఒత్తిడిని తగ్గించే కార్యక్రమాలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,నవంబర్ 13,ప్రభాతవార్త:** బాలికలలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించే వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం కాచిగూడ నింబోలి అడ్డ ప్రభుత్వ బాలికల వసతి గృహం (జువెనైల్ జస్టిస్ శాఖ)లో నావార్థ్ కార్యక్రమాన్ని కలెక్టర్ హరి చందన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల అభిరుచి మేరకు వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సృజనాత్మకతో ఉపయోగకరమైన కొత్త వస్తువులను తయారుచేసే విధంగా ప్రత్యేక తర్ఫీదు అందించాలని అన్నారు. ఈకార్యక్రమాలు చేపట్టడంతో బాలికలలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని సూచించారు. ఈసందర్భంగా పిల్లలతో మాట్లాడుతూ విద్య ఒక విలువైన ఆయుదమని ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువుతో పాటు ఎంచుకున్న అంశంలో శ్రద్ధగా కష్టపడి పనిచేయాలని ప్రోత్సహించారు. అదేవిదంగా ఇక్కడ అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కోర్సులతో పాటు ఈనావార్థ కార్యక్రమం కూడా బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ శుద్ధపెట్టాలని అన్నారు. తదుపరి భోజనశాల, వంటగదిని పరిశీలించి గదులను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాలను రుచి చూసి మెనూ ప్రకారం అందించాలని అలాగే బాలికలకు అందుతున్న సదుపాయాలను తెలుసుకున్నారు. అలాగే బాలికలకు ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, వసతి గృహంలో గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు మైథిలి, వయోవృద్ధుల శాఖ ఎడి రాజేందర్, జాయింట్ డైరెక్టర్ ఎఫ్ఎం మంజుల, వైద్యురాలు డాక్టర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో గృహిణి ఆత్మహత్యాయత్నం

**-బెడ్ రూమ్‌లో గ్యాస్ విప్పిన వైనం -దగ్ధమైన ఇంటి వస్తువులు**



గాయాలతో ఉన్న ప్రతిభ

ప్రమాదంలో కాలిబూడిదైన వస్తువులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో గ్యాస్ సిలిండర్ ఇప్పి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటనలో మహిళకు తీవ్ర గాయాలు కాగా నివాసంలోనే వస్తువులు కాలిపోయాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం ఉదయం చైతన్యపు డివిజన్ ద్వారకపురంకాలనీలో అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది వెంటనే ద్వారకపురంలోని రోడ్‌నెంబర్ మూడులోని సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటన స్థలానికి వెళ్లి చూడగా యు.ప్రతిభ(40)అనే మహిళ 90 శాతం తీవ్ర కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో పడిఉంది. వెంటనే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె మొదటి అంతస్తులోని తన బెడ్‌రూమ్‌లోకి గ్యాస్ సిలిండర్‌ను తీసుకెళ్లి సిలిండర్ ఓపెన్ చేసి నిప్పంటించడంతో సుమారు 90 శాతం కాలిన గాయాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. బెడ్‌రూమ్‌ల గ్యాస్‌సిలిండర్ పేలడం అనుమానస్పదంగా మారడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. ప్రతిభది హత్య, ఆత్మహత్య, ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు జరుగుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కష్టాలు, కన్నీళ్లను గ్రంథ రచనలు చేయడం విశేషం

**-కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ రాములు**



డాక్టర్ అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటిని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 13 (ప్రభాతవార్త ):** జీవితంలో ఎదుర్కొన్న కష్టాలను, కన్నీళ్లను గ్రంథ రచనలు చేయడం డాక్టర్ అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి అని కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ పిల్లలమర్రి రాములు అన్నారు. గురువారం మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ సభ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కుందవరపు హనుమంతరావు కళావేదికలో ప్రముఖ రచయిత కూర చిదంబరం అధ్యక్షతన జరిగింది. నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి, ప్రముఖ కవి రఘుశ్రీ ఆధ్వర్యంలో జరిగిన సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ పిల్లలమర్రి రాములు ఆవిష్కరించి ప్రసంగించారు. జీవితంలో ఎదుర్కొన్న కష్టాలను, కన్నీళ్లను గ్రంథ రచనలు చేయడం విశేషమని అన్నారు. రైతులకు సంబంధించి, ఇతర అంశాల ఆధారంగా రచనలు వెలుగులోకి రావడం మంచి సంప్రదాయమన్నారు. జీవితంలో సానుకూల దృక్పథం ఆధారంగా జీవితం పట్ల సానుకూల దృక్పథంతో ఎలా ఉండాలి, మనిషి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా రచనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్దన మూర్తి, ప్రముఖ ఆశు కవి డాక్టర్ రాధశ్రీ, అధ్యక్షుడు బండారుపల్లి రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ మహిళా వసతి గృహంలో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ మొలగరం

**తార్నాక, నవంబర్ 13 ప్రభాతవార్త :** ఓయూ క్యాంపస్ మౌలిక సదుపాయాల మెరుగుదలలో స్పష్టమైన ముందడుగు వేసింది. అందులో భాగంగా గురువారం ఆర్ఓ ప్లాంట్ ను ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. కుమార్ మొలుగురం చురుకైన నాయకత్వంలో మౌలిక సదుపాయాలు, విద్యాపరమైన జవాబుదారీతనం రెండింటినీ బలోపేతం చేయడంలో గణనీయమైన, ఏకకాలిక చర్యలు చేపట్టింది. విద్యార్థినుల జీవన నాణ్యతను పెంచే ప్రత్యక్ష చర్యలో భాగంగా, విశ్వవిద్యాలయం క్యాంపస్ మహిళా వసతి గృహంలో కొత్త రివర్స్ ఆస్మోసిస్ (ఆర్.ఓ.) వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను ప్రారంభించింది.ఈ ప్లాంట్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, ఉపకులపతి ఓ.ఎస్.డి. ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్, లేడీస్ హాస్టల్ డైరెక్టర్ డా. వై. కల్యాణ లక్ష్మి, హాస్టల్స్ అండ్ మెస్సెస్ చీఫ్ వార్డెన్ డా. గ్యార శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### నేరాల అదుపునకు సిసి కెమెరాలు అవసరం : సిఐ శ్రీకాంత్‌రెడ్డి



సీసీకెమరాల ఏర్పాటు కోసం టీచర్స్‌కాలనీ ప్రతినిధులతో సమావేశమై తుకారాంగేట్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

**కంటోన్మెంట్,నవంబర్ 13 ప్రభాతవార్త:** నేరాల అదుపు,శాంతి భద్రతల పరిరక్షణకు సీసీటీవి కెమరాలు ఎంతో అసరమని, అందువల్ల ప్రతి కాలనీల్లో,గల్లీల్లో ఇంటి పరిసర ప్రాంతాల్లో సీసీకెమరాలను ఏర్పాటు చేసుకోవాలని తుకారాంగేట్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశమై పలుసూచనలు ఇచ్చారు. సీసీకెమరాలు ఏర్పాటుకు కాలనీ వాసుల సహాయ సహకారాలు ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సాయి ప్రకాశ్,అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

## నిరుపేద వైద్యానికి ఎల్ఓసి అందజేత

**- ప్రకాశ్‌గౌడ్, కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**



నిరుపేదైన తన్వి చెవి ఆపరేషన్‌కు రూ.5.లక్షల సీఎం సహాయ నిధి ఎల్ఓసిని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, నవంబర్ 13 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌కు చెందిన తన్విది నిరుపేద కుటుంభం. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన చెవి పోటితో ఇబ్బంది పడుతున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత చూయించినా సమస్య తగ్గలేదు. రోజు రోజుకు చెవి నొప్పి భరించలేనిదిగా తయారైంది. కార్పోరేట్ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయిస్తే ఆపరేషన్ చేసేందుకు రూ.7.లక్షలు ఖర్చు అవుతుందని తేల్చారు. ఇంత డబ్బును తాను భరించలేనని, చెవి నొప్పిని భరించలేక పోతున్నానని తన్వి కన్నీరుమున్నీరయ్యాడు. అతడి కుటుంబ సభ్యులు హైదర్షాకోట్ మాజీ సర్పంచ్, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యలు పూలపల్లి కృష్ణారెడ్డిని సంప్రదించి, తమ సమస్యను వివరించారు. వెంటనే కృష్ణారెడ్డి బాధితులను వెంట తీసుకొని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిపించి, తన్వి బాధను, వైద్యంకు అయ్యే ఖర్చును వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రూ.5.లక్షల ఎల్ఓసిని ఇప్పించి, నిరుపేదకు మెరుగైన వైద్యంను అందించాలని సూచించారు. ఒకేసారి రూ.5.లక్షల డబ్బులు ఇప్పించడం పట్ల తన్వి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కృష్ణారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, వంశీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్-25 కార్యాలయంలో అగ్నిప్రమాదం

**-మంటలు ఎగిసిపడటంతో రెయిలింగ్ దూకి బయటపడ్డ ఉద్యోగులు**
**-రెవెన్యూ రికార్డులు ధ్వంసం**
**-క్యాష్‌కౌంటర్ వద్ద మంటలు అంటుకోవడంతో నగదుపై కూడా ప్రభావం**



**కుత్బుల్లాపూర్, నవంబరు 13 ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్25లో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో తీవ్ర భయాందోళనకు గురై ఉద్యోగులు రెయిలింగ్ ద్వారా బిల్డింగ్ మీదినుండి దూకి ప్రాణాలను కాపాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఉద్యోగులు మంటలను చూసి పరుగుతీయగా కొందరు ఉద్యోగులు మున్సిపల్ సర్కిల్25 డిప్యుటీ కమిషనర్ నర్సింహ్మకు సమాచారం అందించగా ఆయన వెంటనే జీడిమెట్ల పోలీసులు, ఫైర్‌స్టేషన్‌కు హుటాహుటాన సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు యత్నించి ఎట్టకేలకు మంటలను ఆర్పారు. మంటలు ఎలా అంటుకున్నాయి. ఎంత ఆస్థినష్టం అనే వివిధ కోణాలలో అధికారులు ఆరాతీస్తున్నారు. రెవెన్యూవిభాగానికి చెందిన ఫైళ్లు పెద్దఎత్తున అంటుకున్నప్పటి సుమారు నాలుగు గంటలపాటు మంటలు కొద్దికొద్దిగా పెరుగుతూ అధికారులు, సిబ్బందిని కలవరపెట్టాయి. మున్సిపల్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో దట్టమైన పొగలు కమ్ముకోవడంతో ఉద్యోగులకు కొద్దిసేపు ఊపిరి ఆడని పరిస్థితి చోటుచేసుకుంది. బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ నరేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో చోటుచేసుకుందని మున్సిపల్ కమిషనర్ ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వగా వెంటనే జీడిమెట్ల ఫైర్ఇంజన్ కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందించి వెంటనే కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నాలు, ప్రత్యామ్నాయాలు ప్రారంభించినట్లు తెలిపారు. జీడిమెట్ల పోలీసులు, సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో స్థానికంగా అన్ని ప్రయత్నాలు చేసి ఎట్టకేలకు మంటలను అదుపుచేసనినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎనమిది మంది ఉద్యోగులు మంటల్లో చిక్కుకోగా జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో వారిని ప్రత్యామ్నాయ మార్గం గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే సాయంత్రం ఐదున్నర సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నట్లు ఉద్యోగులు తెలుపుతుండగా మంటల వ్యాప్తికి సరైన కారణాలను అన్వేషించాల్సి వుందని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లక్ష్మీగణేష్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే కూకట్‌పల్లి జోనల్ ఎస్‌సి చెన్నారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అయితే మంటలవ్యాప్తిపై వివిధ కోణాల్లో విచారిస్తే తప్ప పూర్తి సమాచారం తెలియదని ఉద్యోగులు, పోలీసులు భావిస్తున్నారు.

**మంటల్లో ఎనిమిదిమంది ఇంజనీరింగ్, రెవెన్యూ ఉద్యోగులు**

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సాయంత్రం ఐదుగంటల పదిహేను నిమిషాలకు షార్ట్ సర్క్యూట్ తో మంటలు అంటుకోగా అప్పటికే మంటలను గుర్తించిన కొందరు ఉద్యోగులు పరుగులు తీయగా మొత్తం ఎనమిది మంది ఉద్యోగులు మంటల్లో చిక్కుకుపోయారు. ఇదిగుర్తించిన జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ప్రత్యామ్నాయ మార్గాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్నవిషయం గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలనుండి ఉద్యోగులను రెయిలింగ్ మెట్లద్వారా సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. ఉద్యోగులందరూ మంటల నుండి బయటపడే సమయానికి జీడిమెట్ల, సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్లనుండి ఫైర్ఇంజన్లు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. అగ్నికీలలకు ఒక్కసారిగా రెవెన్యూ విభాగంలోని ఫైళ్లు మంటలకు ఆహుతైనా ప్రాణహాని నుండి ఉద్యోగులను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాలి

**-16న బిసి న్యాయ సాధన దీక్షా**



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ నవంబర్ 13 ప్రభాతవార్త :** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిసి న్యాయ సాధన దీక్షను చేపట్టబోతున్నట్లు రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం కాచికూడలో పద్నాలుగు బి.సి సంమాలు సమావేశం జరిగింది. జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగాలలో రేజర్వేషన్లను కేటాయించడంతో పాటు స్థానిక సంస్థలు రిజర్వేషన్లను కల్పించే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని, ఏకాభిప్రాయంతో ముందుకు రావాలన్నారు. రాజ్యాంగ సవరణకు కూడా మద్దతు ఇవ్వాలని, రేజర్వేషన్ల సమస్యకు ప్రతిసారి వ్యతిరేకంగా కోర్టులు తీర్పులు వస్తున్నాయని, దీనికి రాజ్యాంగ బద్ధత కల్పించడమే శాశ్వత పరిష్కారమన్నారు .స్థానిక సంస్థల రిజర్వేషన్ ల మహారాష్ట్ర ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయని, కానీ రాష్ట్రాలలో బిసిలు తిరగబడలేదని, ఉద్యమాలు చేయలేదని, కానీ మన రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ కోసం వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్నామని, ఇది బిసిల చైతన్యానికి ప్రతీక అని అన్నారు. ఉద్యమాన్ని ఉదృతం చేయాలని పిలుపు.స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ సాధనకై ఉద్యమాన్ని ఉదృతం చేయాలనీ పిలుపు నిచ్చారు. అన్ని జిల్లాలలో, నియోజకవర్గ కేంద్రాలలో బీసీ సంఘాలు, కులసంఘాలు, ప్రజా సంఘాలతో సమావేశాలను నిర్వహించి కార్యావరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. అన్ని పట్టణాలు, జిల్లాలు, మండలాల కేంద్రాల్లో నిరాహార దీక్షలు, ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిలపల్లి అంజి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నవారు సి.రాజేందర్ రాందేవ్ మోడీ. రాజ్ కుమార్ బీమ్ రాజ్ శివ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐసిఎస్ఐ న్యూఢిల్లీ డీన్‌గా ఓయూ ప్రొ.అప్పారావు నియామకం



ప్రొ.అప్పారావును శాలువాతో సన్మానిస్తున్న సహచర ప్రొఫెసర్లు

**తార్నాక, నవంబర్ 13 ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం మాజీ ఆచార్యులు, వాణిజ్య ఫ్యాకల్టీ మాజీ డీన్, వాణిజ్య బోర్డు ఆఫ్ స్టడీస్ మాజీ చైర్మన్ అయిన ప్రొ. వి. అప్పారావు దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వృత్తిపరమైన సంస్థలలో ఒకటైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ)న్యూఢిల్లీలో డీన్ (ఒప్పంద ప్రాతిపదికన)గా నియమితులయ్యారు. ఆయనను సెంటర్ ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, హైదరాబాద్ ఐసిఎస్ఐ ..సిసి జిఆర్టిహైదరాబాద్) కేంద్రంలో నియమించారు.ప్రొ. అప్పారావు 2025 నవంబర్ 10న న్యూఢిల్లీలోని ఐ సి ఎస్ ఐ ప్రధాన కార్యాలయంలో విధుల్లో చేరి, మూడు రోజులపాటు జరిగిన ఇండక్షన్, ఓరియెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆయన ఐ సి ఎస్ ఐ సీనియర్ అధికారులతో పరస్పర చర్చలు జరిపి, కేంద్రం చేపడుతున్న ముఖ్యమైన విద్యా మరియు వృత్తి సంబంధిత కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆయన హైదరాబాద్‌లోని ఐ సి ఎస్ ఐ.. సి సి జి ఆర్ టి కేంద్రంలో గురువారం విధుల్లో చేరారు.ఈ సందర్భంగా ప్రొ. అప్పారావు ఐ సి ఎస్ ఐ సంస్థ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, హైదరాబాద్ కేంద్రంలోని విద్యా మరియు పరిశోధన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి తన కట్టుబాటును వ్యక్తం చేశారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం లోని ప్రస్తుత మరియు మాజీ అధ్యాపకులు, విద్యార్థు లు, పరిశోధకులు ప్రొ. అప్పారావుకు హృదయపూర్వ క అభినందనలు తెలుపుతూ, ఆయనకు నూతన బాధ్యతల్లో విజయవంతమైన పదవీకాలం ఉండాలని ఆకాంక్షించారు.

## జనవరిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలు



**హైదరాబాద్ నవంబర్ 13 ప్రభాతవార్త ;** అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండస్థలాలపై సర్కారుకు వినతులు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహాసభలను వచ్చే జనవరి చివరి వారంలో నిర్వహించాలని సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. మహాసభల నిర్వహణ కోసం సీనియర్ జర్నలిస్ట్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు పి.రాంచందర్ కన్వీనర్‌గా నియమించింది. మరో 23 మందితో అడహక్ కమిటీని ఏర్పాటు చేసింది. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ పిల్లి రాంచందర్ అధ్యక్షతన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు జి.మాణిక్ ప్రభు, తాటికొండ కృష్ణ, గుడిగ రఘు, బి.రాజశేఖర్, కార్యదర్శులు ఎస్కె సలీమ, ఇ.చంద్రశేఖర్, బి.జగదీష్, కొప్పు నిరంజన్, బి.దయాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మణిమాల, విజయ, బీవీఎన్ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు, 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, స్టేట్ కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్, అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్లు, ఇండ్లస్థలాలు, హెల్త్‌కార్డుల విషయంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది.

**మామిడి సోమయ్య ప్రాథమిక సభ్యత్వం రద్దు..**

సంఘం అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, వల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితూడి బాపూరావుల ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు సంఘం నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాన్ని విస్తృతస్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.బహిష్కరణకు గురైన వారికి ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని సమావేశం తీర్మానించింది. ఈ విషయాన్ని జర్నలిస్టులు, ఫెడరేషన్ శ్రేయోభిలాషులు గ్రహించాలని విజ్ఞప్తి చేసింది. ఏకపక్షంగా సోమయ్య వేసిన జిల్లా కమిటీలను రద్దు చేస్తున్నట్టు విస్తృత కార్యవర్గం ప్రకటించిందపి సమావేశం వివరాలను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య తెలిపారు.

## సుందరయ్య పార్క్ గ్రీనరీ ధ్వంసం ఆపాలి : హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం



సుందరయ్య పార్క్‌లో గ్రీనరీని తొలగిస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 13 (ప్రభాతవార్త);** సుందరయ్య పార్క్‌లో వారం రోజుల నుండి పచ్చదనానిచ్చే గ్రీనరీని తొలగించి, పిల్లల ఆట వస్తువులు నిర్మించేందుకు జిహెచ్ఎంసి అధికారులు పనులు ప్రారంభించారని, సుందరమైన పార్క్‌ను ధ్వంసం చేస్తున్నారని, వెంటనే పార్క్‌లో తవ్వకాలను ఆపివేయాలని, గ్రీనరీని కాపాడాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం డిమాండ్ చేసింది. గురువారం ఈ మేరకు ఫోరమ్ ప్రతినిధులు జిహెచ్ఎంసి జోనల్ కమీషనర్ రవి కిరణ్ ను కలిసి వినతి పత్రాన్ని అందించి చర్చించింది. అధికారిని కలిసిన వారిలో అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరయ్య, ఉపాధ్యక్షులు శంకరయ్య, సుకుమార్ సహాయ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికే పార్క్‌లో పిల్లల ఆట స్థలం, షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్, ఆఫీసు బిల్డింగ్ లకు ప్రత్యేక స్థలాలు ఉన్నాయని, పిల్లల ఆట వస్తువుల నిర్మాణానికి ఇప్పటికే వేరే స్థలం కేటాయించారని, అక్కడ కొంగలు రెట్టలు వేస్తున్నాయని, సుందరమైన పచ్చదనాన్ని ఇచ్చే పార్కు స్థలంలో పిల్లల ఆట వస్తువుల నిర్మాణానికి పనులు చేపట్టారన్నారు. లారీల పార్కింగ్‌ల వలన పార్క్ గ్రీనరీ ఇప్పటికే పూర్తిగా దెబ్బతిన్నదని, నగరంలో వాయు కాలుష్యం పెరుగుతున్నదని ఒకవైపు పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తుంటే, మరొకవైపు అధికారులు గ్రీనరీని ధ్వంసం చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. పార్క్‌ను 2023 సంవత్సరంలో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఆధునీకరించి, మరమత్తులు చేశారని, అయినా రెండు సంవత్సరాల నుండి సుందరయ్య పార్కు వాకింగ్ ట్రాక్ వర్షం వచ్చిన ప్రతిసారీ నీటితో నిండిపోతున్నదన్నారు. పిల్లల ఆట వస్తువులు విరిగిపోయి రెండు సంవత్సరాలైందని, ఈ విషయంపై జిహెచ్ఎంసి అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ సరియైన మరమ్మతులు చేయలేదన్నారు. సుందరయ్య పార్కు లో గ్రీనరీని కాపాడాలని, పిల్లల ఆట వస్తువులను గతంలో ఉన్న పిల్లల ఆట స్థలంలోనే ఏర్పాటు చేయాలని కోరారు.

## భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి : డా. జి.చిన్నారెడ్డి



గ్రంథావిష్కరణ కావిస్తున్న చిన్నారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య తదితర అతిథులు

**నాంపల్లి, నవంబరు 13 ప్రభాతవార్త :** మన ఆచారాలు, సంప్రదాయాలు భారతీయ సంస్కృతిలో భాగమని, ఈ సంస్కృతి మూలరూపమైన జానపద విజ్ఞాన పరిరక్షణకు కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి అన్నారు. మనిషి పుట్టుక నుండి మరణం వరకు మన సంస్కృతి, నమ్మకాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయని, అవి అంతరించపోకుండా కాపాడుకోవాలన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం రాత్రి బొగ్గులకుంట సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య నిర్వహణలో జరిగిన గ్రంథావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి విశిష్ట అతిథులు డా. చింతపల్లి వసుంధరారెడ్డి, ఆచార్య పాకనాటి జ్యోతి, డా. అజ్మీరా సిల్మానాయక్ తదితరులతో కలిసి సారస్వత పరిషత్తు ప్రచురించిన జానపద విజ్ఞానం–పరిరక్షణ గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. సభకు జె.చెన్నయ్య స్వాగతం పలుకగా శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి సంపుటాలు వెలువరిస్తున్నామని, బాలల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

### జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపు ఖాయం

**-కాంగ్రెస్ నేత కోరాని రాజ్ కుమార్**

**హైదరాబాద్, నవంబర్ 13,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయం అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోరాని రాజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గత పది సంవత్సరాల బి.ఆర్.ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిపోయిందని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని రెహమత్ నగర్, బోరబండ, ఎర్రగడ్డ, షేక్ పెట్ వంటి తదితర ప్రాంతాలలో డ్రైనేజీ నుంచి మురుగునీరు పొంగి పొర్లుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతుల రుణమాఫీ, నిరుద్యోగ యువతకు ఉపాధి తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని తెలిపారు. ఆ అభివృద్ధి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపుకు కారణం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండే సీనియర్ నాయకుడు నవీన్ యాదవ్ ఎవరికి ఆపద వచ్చిన ఆదుకోనలో ముందుంటాడని అన్నారు. కరోనా సమయంలో ఆయన పేద ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివ్వని పేర్కొన్నారు.

### అమ్మవారి ఆలయంలో చొరబడిన దుండగులు

**-అమ్మవారితో పాటు హుండీ పూజ సామాగ్రి ధ్వంసం**



ధ్వంసం చేసిన అనంతరం ఆలయం లోపలి దృశ్యం

**దుండిగల్, నవంబర్ 13 ప్రభాతవార్త:** గుర్తు తెలియని దుండగులు అమ్మవారి ఆలయంలో చొరబడి అమ్మవారితో పాటు లోపలి సామాగ్రి అంతటిని ధ్వంసానికి పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం..దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి కాకతీయ వెంచర్‌ని పార్కు స్థలంలో బాలాజీకాలనీ, సత్యసాయికాలనీ, శంకర్‌నగర్ వాసులు మూడు సంవత్సరాల కిందట నల్లపోచమ్మ ఆలయం నిర్మించారు. ప్రతి ఏటా అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం అమ్మవారికి దీప దూప నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు చేస్తున్నారు. బుదవారం సాయంత్రం పూజ అనంతరం ఆలయానికి తాళలు వేసి గురువారం ఉదయం పూజ కోసం వెళ్ళి చూడగా తాళలు పగులగొట్టి కనిపించాయి. ఆలయంలో లోపల అమ్మవారి ప్రతిమతో పాటు హుండీ పూజాసామాగ్రి పూర్తిగా ధ్వంసం చేసి ఉన్నాయి. దీంతో కాలనీవాసులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈమేరకు డిఐ బాల్‌రెడ్డి సదరు ఆలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా కావాలనే అమ్మవారి ఆలయంలో విధ్వంసానికి పాల్పడ్డారని, దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కాలనీవాసులు పోలీసులను కోరారు.

## ఆరంభం... అదరగొట్టారు

**- ఆకట్టుకున్న హ్యామ్‌స్టెక్ విద్యార్థులు.**




మిస్టర్ అండ్ మిస్ హ్యామ్‌స్టెక్ విజేతలు

**జూబ్లీహిల్స్, నవంబరు 13, ప్రభాతవార్త:** హ్యామ్‌స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గురువారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో వార్షిక ఫ్రెషర్స్ పార్టీ–2025ను ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్త విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సంగీతం, నృత్యం, వినోదంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా మిస్టర్ అండ్ మిస్ హ్యామ్‌స్టెక్ -2025 పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తాము రూపొందించిన దుస్తు డిజైన్లను విద్యార్థులు ధరించి ఇక్కడ వేదికపై ప్రదర్శించారు. సంప్రదాయ దుస్తులతోపాటు అధునాతన వస్త్ర శైలితో కూడిన డిజైన్లను ఇక్కడ ప్రదర్శించారు. ఈ సందర్భంగా హ్యామ్‌స్టెక్ సీఈఓ అజితారెడ్డి మాట్లాడుతూ తమ సృజనాత్మక ప్రదర్శనను ప్రదర్శించడానికి ఇదొక సరికొత్త వేదికని అన్నారు. సీబీఓ స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిచడానికి ఇది మంచి అవకాశమన్నారు.

### క్యాబ్‌లో పొగొట్టుకున్న బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు

**కంటోన్మెంట్,నవంబర్ 13 ప్రభాతవార్త:** బెంగుళూర్‌కు చెందిన ఆర్మీ ఇంజనీర్ నరేశ్ అనే వ్యక్తి బుధవారం లాల్‌బజార్‌లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి శుభకార్యానికి సిద్దిపేట నుంచి క్యాబ్‌లో లాల్‌బజార్‌కు వచ్చాడు. అయితే అతని వెంట తెచ్చుకున్న బ్యాగ్‌ను మర్చిపోయి దిగిపోయాడు. వెంటనే విషయం తెలుసుకున్న బాధితుడు వెంటనే తిరుమలగిరి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సీసీటీవి ఫ్యూటేజీల సహకారంతో క్యాబ్‌ను గుర్తించి పొగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి 3 గంటల్లో అతనికి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు బ్యాగ్‌లో ఉన్న వస్తువులను,ఐడీ కార్డును తనిఖీ చేసి అతనికి అప్పగించారు. బ్యాగ్‌ను పోగొట్టుకున్న ఆర్మీ ఇంజనీర్ నరేశ్‌కు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఉప్పల్‌లో ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

**ఉప్పల్, నవంబరు 13 ప్రభాతవార్త :** కుటుంబ సమస్యలతో ఒక వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సీతారామకాలనీలో నివసించే బిక్షపతి కుమారుడు సందీప్‌కుమార్(28)కు వారాసిగూడకు చెందిన శాంతి(28)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నట్లు తెలిపారు. కాగా నెల రోజుల క్రితం తన భార్య శాంతి డెలివరీ నిమిత్తం వారాసిగూడకు వెళ్లగా ఈనెల 12వ తేదిన తన భార్య డెలివరీ అయినట్లు తెలిపారు. కాగా అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చి ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉదయం ఇంటి యజమాని గమనించి బంధువులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రేమ వివాహం చేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంపై పలు కథనాలు వినిపిస్తున్నాయి. భార్య డెలివరీ అయిన మరుసటి రోజే ఆత్మహత్యకు పాల్పడడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎండు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**ఉప్పల్, నవంబరు 13 ప్రభాతవార్త :** ఎండు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరిపల్లి సహర్షరాజ్, పోనవోజు మనోజ్ చారి, కావడి జయవర్ధన్, కళ్యాణ్‌రెడ్డిలు ఎపి నుంచి అక్రమంగా ఎండు గంజాయి తెచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో రామంతాపూర్, ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో ఎండు గంజాయి విక్రయిస్తుండగా రామంతాపూర్ గోఖలే నగర్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి సుమారు 1.720 కిలోల గంజాయి, ఒక రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎపిలోని సీలేరు నుంచి కిలోకు రూ. పదివేలకు ఎండు గంజాయి తెచ్చి నగరంలో చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. వీరిలో ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నారని తెలిపారు. ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్, ఎస్ఐలు శ్రీనివాసులు, పి.నరేష్‌రెడ్డి, ఇతర సిబ్బంది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**ఉప్పల్, నవంబరు 13 ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనం నడిపిన ఒక వ్యక్తికి మేడ్చల్ జిల్లా కోర్టు రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధించింది. ట్రాఫిక్ సిఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన కలపల్లి లక్ష్మణ్(36) రెండోసారి మద్యం సేవించి పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. గతంలో ఒకసారి మద్యం సేవించి వాహనం నడిపించగా కోర్టు జరిమానా విధించిందని, తిరిగి రెండోసారి పట్టుబడడంతో అతనికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## లిఫ్ట్ ప్రమాదంలో వృద్ధుడు మృతి

**చార్మినార్,నవంబరు 13 ప్రభాతవార్త :** లిఫ్ట్ ప్రమాదంలో డబ్బై ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పాతబస్తీ గాజీమిల్లత్ కాలనీకి చెందిన సయ్యద్ అబ్దుల్ యాఫై (70) అనే వృద్దుడు అహ్మద్ నగర్‌లో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లాడు.గురువారం సాయంత్రం కూతురు ఇంటి నుంచి సయ్యద్ అబ్దుల్ తన ఇంటికి బయలు దేరాడు.అపార్టుమెంట్‌లోని ఐదవఫ్లోర్ వద్ద సయ్యద్ అబ్దుల్ లిఫ్ట్ బటన్ నొక్కగా లిఫ్ట్ తలుపు తెరుచుకుంది.కాని కింది నుంచి మీదకు లిఫ్ట్ మాత్రంరాలేదు.ఇది గమనించని సయ్యద్ అబ్దుల్ లిఫ్ట్ ఉందని భావించి కాలు వేయగా అపార్ట్‌మెంట్‌లోని ఐదవ ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయాడు.ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన సయ్యద్ అబ్దుల్ చని పోయాడని పోలీసులు తెలిపారు.ఈ కేసును చాంద్రాయణగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫిజియోథెరపి కోర్సును సద్వినియోగం చేసుకోవాలి




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ అరుణ్‌బాబు, మహ్మద్ హుస్సేన్, ఈశ్వర్ ప్రసాద్ తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 13,ప్రభాతవార్త:** కాళోజి నారాయణ యూనివర్సిటీకి అనుబంధగా ఉన్న ఎస్ఎంబి కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపిలో నూతన ఫిజియోథెరపి కోర్సు ప్రారంభం అవుతున్నట్లు కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అరుణ్ బాబు, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్,డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌లు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరుణ్ బాబు మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ లో బైపిసి, ఒకేషనల్ విద్య ను అభ్యసిస్తున్న వారికోసం నాలుగున్నర సంవత్సరాల ఫిజియోథెరపి కోర్సు ను ఎస్ ఎం బిలో నూతనంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సీట్ల కోసం హైదరాబాద్ లోని తమ ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలనిఒక బ్యాచ్ లో మొత్తం 50 మంది విద్యార్థులు ఉంటారని అందులో ముప్పై మంది కౌన్సిలింగ్ నుండి మిగతా ఇరవై మంది మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు భర్తీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఫిజియోథెరపికి మన దేశంలో, విదేశాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని,విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

## ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి : ఎమ్మెల్యే



**మల్కాజిగిరి నవంబరు13,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మోలాలి ప్రాంతంలోని ప్రభుత్వ యునాని వైద్యశాల ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఎమ్మెల్యే రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, డాక్టర్ సానియా ఫాతిమా మరియు ఫార్మసిస్ట్ దయానంద నుండి ఆసుపత్రి కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, మున్సిపల్ శానిటేషన్ అధికారులను తక్షణ చర్యలు తీసుకుని ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటును గుర్తు చేస్తూ, ప్రతి ప్రజా వైద్యశాలలో నాణ్యమైన సేవలు అందేలా కృషి కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జె.ఎ.సి వెంకన్న, ఉస్మాన్, హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్




**మల్కాజిగిరి నవంబరు13,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సిఫిల్ కాలనీ కళ్యాణ్ నగర్ మెయిన్ రోడ్ సుమారు 60 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, ఓం రాజ్, శ్రీమన్నారాయణ, జయ కృష్ణ, కిరణ్ కుమార్, చంద్రకళ, శేషగిరి, సుదర్శన్, పెద్దిరాజు, చంద్రకాంత్, సోమయ్య, జగన్మోహన్, హరిప్రసాద్, శర్మ,కిషోర్, పాల్గొన్నారు

## రైతుల అభ్యున్నతి కోసం కృషి : వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్


టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 13, ప్రభాతవార్త:** రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అభ్యున్నతి కోసం కోసం కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. హైదరాబాద్ మార్కెట్ కమిటీ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి వివరించడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తున్నామని వివరించారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



**మల్కాజిగిరి నవంబరు13,ప్రభాతవార్త :** మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సెవెన్ రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు గురువారం పండ్లను పంపిణీ చేశారు. సెవెన్ రా ఫౌండేషన్ హైకోర్టు అడ్వకేట్,చైర్మన్ తిప్పారపు కీర్తి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కటకం మురళీధర్ హాజరై ఫౌండేషన్ సభ్యులతో కలిసి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెవెన్ రా ఫౌండేషన్ చైర్మన్ కీర్తి కుమార్ హైకోర్టు అడ్వకేట్ అయి ఉండి చిన్న వయసులో సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభినందించదగ్గ విషయమని ఒక ఫౌండేషన్ స్థాపించి అతికొద్ది సమయంలోనే అనేక సేవా కార్యక్రమాలను అందిస్తున్నారని అన్నారు.ఫౌండేషన్ స్థాపించిన రోజును పురస్కరించుకొని రోగులకు పండ్లను పంపిణీ చేయడమే కాకుండా గతంలో విద్యార్థులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఎగ్జామ్ ప్యాడ్స్,స్టడీ మెటీరియల్స్ అందించడం లాంటి కార్యక్రమాలను చేసి ఉన్నారని ఫౌండేషన్ సేవలను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత,ఏవో డాక్టర్ సంగీత్ కుమార్,లతోపాటు తిప్పారపు లక్ష్మణ్, కేశపాగ రామచందర్,సాత్విక్,సమైక్, చుంచు అశోక్, మనోహర్, యాతాకుల అశోక్,రామకృష్ణ, విజయరావు, ప్రణయ్,అంజి, ప్రభాకర్,సంతోష్,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా థీమ్ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలి


మహిళా థీమ్ పార్కులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. నవంబర్.13.ప్రభాతవార్త.** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ మరియు ఎన్‌జిఓఎస్ కాలనీలో అభివృద్ధి చేస్తున్న ఉమెన్స్ థీమ్ పార్క్ పనులను ఈ రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం ఎఈ కార్తీక్ గారితో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ త్వరలోనే మహిళలకు ఈ పార్క్ అందుబాటులోకి వచ్చే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, కేవలం మహిళల కొరకు ఈ యొక్క పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందని, కావున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, మరియు ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ ఉన్నారు.

# ఉప్పల్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎక్కడా?

## -ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు
## - పెండింగ్‌లో దరఖాస్తులు

**ఉప్పల్, నవంబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉప్పల్, కాప్రా సర్కిళ్లకు కలిసి ఒకే టిపిఎస్ ఉండడంతో ఒకే అధికారి రెండు ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు చూపిస్తూ ఎక్కడా కూడా అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సర్కిల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిద్రావస్థలో ఉండడంతో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఇంటి అనుమతులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరిగి విసిగి పోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సరియైన విధంగా స్పందించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిగా కృష్ణమూర్తి, టిపిఎస్‌గా తుల్జాసింగ్‌లను నియమించారు. నాలుగు డివిజన్‌లకు కలిపి ఒకే చైన్‌మెన్ ఉన్నారు. వీరికి అదనంగా మరో అసిస్టెంట్‌ను నియమించారు. అయితే కేవలం ఒకరిద్దరు కిందిస్థాయి అధికారులు తప్పా మిగిలిన వారంతా నిత్యం బయటే స్వంత పనులపై తిరుగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. సర్కిల్ కార్యాలయంలో నిత్యం అనేక మంది పలు ఫిర్యాదులపై వస్తున్నా తమ సమస్య ఎవరికి చెప్పాలో తెలియక అయోమయంలో పడిపోతున్నారు.

**ఒక్కో అధికారికి ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు :**


ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఖాళీగా దర్శనం ఇస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల కుర్చీలు

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో పనిచేసే ఒక్కో అధికారి ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుంటున్నారు. అధికారులు లేకున్నా వీరే బయట తిరిగి ఇంటి అనుమతుల పత్రాలు పరిశీలించడంతోపాటు, స్థల పరిశీలన చేసి అధికారులను కలవాలని చెప్పి పంపుతున్నారు. బయటి వ్యక్తులకు అందినంత ఇచ్చిన తర్వాతే తమ పని చేస్తున్నారని, లేదంటే తమను చెప్పులు అరిగేలా తిప్పుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సర్కిల్‌లో పనిచేసే ఒక అధికారి కారు డ్రైవర్ నేరుగా భవన యజమానుల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఇటీవల కొందరు ఫిర్యాదు చేశారు. మరో అధికారి తాను లేకున్నా సదరు ప్రైవేటు వ్యక్తిని కలిసి రావాలని చెప్పి పంపుతున్నారని పలువురు దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు. మరోవైపు కొందరు అధికారులు కోర్టు కేసుల పేరుతో తమ స్వంత పనులపై తిరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

**కాసులు కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు :**

ఉప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతి లేని భవనాలు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. అనుమతి లేని భవనాలను సీజ్ చేసినట్లు ప్రకటించి వారి నుంచి ముడుపులు తీసుకున్న తర్వాత తిరిగి నిర్మాణం చేసుకోవాలని గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఉప్పల్ భగాయత్‌లో ఒక హోటల్‌తోపాటు, రామంతాపూర్, చిలుకానగర్, ఉప్పల్ ప్రధాన రహదారిలో కూడా భవనాలను సీజ్ చేసినట్లు హంగామా చేశారు. అయితే తిరిగి అదే భవనాల్లో నిర్మాణాలు యథేచ్చగా సాగడంతోపాటు అధికారులను కలిసినట్లు బహిరంగంగా చెబుతున్నారు. సర్కిల్ కార్యాలయంపై ఎసిబి అధికారులు కూడా సరియైన దృష్టి పెట్టకపోవడంతో అవినీతి పెరిగిపోతుంది. మధ్యవర్తుల ద్వారా వచ్చిన పైళ్లు త్వరితగతిన పూర్తి చేస్తూ నేరుగా వచ్చిన సామాన్య ప్రజలను తిప్పుకుంటున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై డిప్యూటి కమిషనర్ రాజును వివరణ కోరగా టౌన్‌ప్లానింగ్‌లో సిబ్బంది కొరత ఉందని, తనకు కూడా అందుబాటులో ఉండడం లేదని పేర్కొన్నారు.

## పార్కులలో పలు అభివృద్ధి కార్యక్రమాలు: కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

**మలక్ పేట ,నవంబర్ 13, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ డివిజన్ లోని పార్కులలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్లోని కృష్ణానగర్ మిత్ర పార్కులో రూ.2 లక్షలతో నిర్మిస్తున్న పుట్ పాత్ కర్బింగ్ పనులు, ఇతర అభివృద్ధి పనులను జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కులో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, అదేవిధంగా కమ్యూనిటి హాల్ ను నిర్మించడం జరిగిందని వివరించారు. త్వరలో సివిల్ పనులు పూర్తి అవుతాయని, అనంతరం గ్రీనరీ పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. డివిజన్ లో రానున్న రోజులలో సుమారు రూ. 3 కోట్ల నిధులతో రోడ్లు, పార్కులు, కమ్యునిటి హాల్ తదితర అభివృద్ధి పనుల కోసం జోనల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించడం జరిగిందని, జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి ఇంజనీరింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇ శరత్ రెడ్డి, ఇన్ స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ముసారాంబాగ్ కృష్ణానగర్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నాసిరకం పనులు చేస్తే ఉపేక్షించం

**-బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలి**
**-సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి స్పష్టీకరణ**

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపట్టే రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, అల్మాస్‌గూడ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి అధికారులను కోరారు. కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ అల్మాస్‌గూడ మల్‌రెడ్డి రాంరెడ్డినగర్ కాలనీ రోడ్ నెంబర్ 2లో రూ.14 లక్షల సాధారణ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులను గురువారం ఆయన స్థానిక కాలనీవాసులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ధనంతో నిర్మించే ఎటువంటి అభివృద్ధి పనైనా నాలుగు కాలాల పాటు మన్నే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉంటుందని అన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, కమ్యూనిటీ భవనాలు తదితర అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. అభివృద్ధి పనులపై అధికారుల నిఘా ఉండాలని ఆయన కోరారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ డివిజన్లలో నాసిరకం పనులు చేపడితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మంజూరైన నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని పార్టీ తరపున తాము పరిశీలిస్తామని ఆయన వెల్లడించారు. రోడ్లు, పటిష్ట డ్రైనేజీ వ్యవస్థలు, అంతర్గత రహదారుల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని ఆయన వివరించారు. అల్మాస్‌గూడలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభం అయిన సందర్భంగా ఆయన సిఎం రేవంత్‌రెడ్డికి, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుకు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్ తదితరులకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ సరస్వతి, డిఇఇ వెంకన్నలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జగన్నాథం, యాదగిరి, పోతులూరి చారి, వెంకట రమణ, మనోహర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాషా, అశోక్‌చారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అల్మాస్‌గూడ మల్‌రెడ్డి రాంరెడ్డినగర్‌లో చేపట్టిన సిసి రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి పర్యవేక్షిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

## దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమే : ఎమ్మెల్యే కూనంనేని

**ఉప్పల్, నవంబరు 13 ప్రభాతవార్త :** దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమే అని, ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కమ్యూనిజం పై ప్రజల నమ్మకం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయని అన్నారు. శ్రీలంక,న్యూయార్క్‌లో కమ్యూనిజం అధికారంలోకి రావడం, ఇప్పుడు నేపాల్‌లో అన్ని కమ్యూనిస్టులు ఐక్యం కావడం నిదర్శనమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ల పండగను నిర్వహించనున్నట్లు, ఈ ముగింపు సభకు 40 దేశాల నుంచి వామపక్ష ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్, జాతీయ సమితి సభ్యులు యూసఫ్ మాట్లాడుతూ సిపిఐ శత జయంతి వేడుకలకు భారీ ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి, సాయిలు గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మి, స్వామి, కిషన్, శంకర్ రావు, హరినాదజ్‌రావు, కృష్ణ,సత్యప్రసాద్, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు



సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు

## రంగారెడ్డి జిల్లా సిఐటియు కార్యవర్గ సభ్యునిగా దాసరి బాబు

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** కార్మికుల పక్షాన నిలుస్తూ వారి సమస్యలపై నిరంతరం పోరాడే సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యునిగా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్ పాత గ్రామానికి చెందిన దళిత సీనియర్ నాయకుడు దాసరి బాబు ఎన్నికయ్యారు. చాలా సంవత్సరాలుగా ఏ రాజకీయ పార్టీ నాయకుడు గానీ, ఏ ప్రజాప్రతినిధి గానీ, ఏ కార్మిక నాయకుడు గానీ చేయని విధంగా బాలాపూర్ మండలంలో ముఖ్యంగా మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిల్లో కార్మికులకు అండగా నిలుస్తూ వారి పక్షాన పోరాడుతున్న దాసరి బాబు సేవలను గుర్తించి ఆయనను సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాటేదాన్ పారిశ్రామిక వాడలో రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా జరిగిన సిఐటియు జిల్లా మహాసభల్లో నాయకులు బాబును ఏకగ్రీవ ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా కార్మికులకు వెన్నుదన్నుగా నిలవడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్మికులకు అండగా ఉండి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడతామని ఆయన పేర్కొన్నారు. జిల్లా కమిటీకి తనను ఎంపిక చేసిన సందర్భంగా తనపై బాధ్యత పెరిగిందనీ రెట్టించిన ఉత్సాహంగా సిఐటియులో పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా మీర్‌పేట్‌లో గురువారం జరిగిన సిఐటియు కమిటీ సమావేశంలో పలువురు నాయకులు బాబుకు ఆత్మీయ సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు నీలం వెంకటయ్య, మల్లికార్జున్, నర్సింహ, బురాన్, ఏడుకొండలు, జగదీశ్, ఆదం, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, కిషన్‌లతో పాటు మున్సిపల్ కార్మికులు మంగమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.


దాసరి బాబుకు ఆత్మీయ సన్మానం చేస్తున్న యువ కామ్రేడ్లు

## చెంగిచెర్లలో డ్రైనేజ్ పనులు ప్రారంభం

**బోడుప్పల్ నవంబర్ 13 ప్రభాతవార్త ;** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల ఒకటవ డివిజన్ లోని అరవింద ఎన్ క్లేవ్ లో 25 లక్షల రూపాయల నిధులతో నూతన డ్రైనేజ్ పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ ,కాంగ్రెస్ యువ నాయకుడు బింగి యోగేష్ యాదవ్, కాలనీ అధ్యక్షులు రామ్ శేఖర్ ముదిరాజ్, మహిళలు , కాలనీవాసులు, పాల్గొన్నారు.


చెంగిచెర్లలో డ్రైనేజ్ పనులను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్ , కొత్త కిషోర్ గౌడ్ , బింగి జంగయ్య యాదవ్ తదితరులు

## టూరిజం మేనేజ్‌మెంట్‌లో డాక్టర్ దినేష్ కుమార్‌కు డాక్టరేట్



డాక్టర్ గట్టు దినేష్ కుమార్ కి పీహెచ్‌డి డిగ్రీని అందజేస్తున్న యూనివర్సిటీ అధికారులు

**మలక్ పేట ,నవంబర్ 13, ప్రభాతవార్త:** నగరానికి చెందిన విద్యావేత్త డాక్టర్ గట్టు దినేష్ కుమార్ తాను చేసిన పరిశోధనలకు డాక్టరేట్ డిగ్రీ (పిహెచ్ డి)ని అందుకున్నారు. చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)లో తెలంగాణలోని అమ్యూజ్మెంట్ పార్కులపై పర్యాటకుల అవగాహన, వైఖరి, సంతృప్తి పై చేసిన పరిశోధనలకు చైతన్య యూనివర్సిటీ అధికారులు దినేష్ కుమార్ కు డాక్టరేట్ డిగ్రీ ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రొఫెసర్ విజయ్ పర్యవేక్షణలో దినేష్ కుమార్ పరిశోధనలు పూర్తి చేశారు. టూరిజం మేనేజ్మెంట్ లో డాక్టరేట్ (పీహెచ్డీ) సాధించిన డాక్టర్ గట్టు దినేష్ కుమార్ ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రధానం చేయడం సంతోషంగా ఉందని, తన పరిశోధనలకు సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని ఎమ్మెల్యే బిఎల్ఆర్ కలెక్టర్‌కు వినతి


జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**నాచారం, నవంబర్ 13 ప్రభాతవార్త :** మల్లాపూర్ సర్వే నెం 110 లోగల 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని కోరుతూ గురువారం ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి,మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. 1996 లో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు, అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నవోదయ మహిళ మండలికి కేటాయించిన స్థలంలో కాప్రా మున్సిపాలిటీ వారు శాశ్వత భవనం నిర్మించడం జరిగింది. సదరు స్థలంలో భవన నిర్మాణం చేసిన తరువాత మిగిలిన ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ శంకుస్థాపన చేశారని వారు కలెక్టర్‌కు వివరించారు.ఈ స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కబ్జాలను నుండి కాపాడి ప్రజలకు ఉపయోగ పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి వివరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, పి.జి సుదర్శన్, రాజేష్, గున్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

## మానికేశ్వరీ నగర్ బస్తీలో ఘనంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న స్వాములు

**తార్నాక, నవంబర్ 13 ప్రభాతవార్త :** మాణికేశ్వరీనగర్ లోని 7 టెంపుల్స్ లో శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ గురువారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి జి.వెంకటేష్ (ఆర్టిఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన సహదేవ గురుస్వామి భజన మండలి ఈ పూజా కార్యక్రమంలో మొదటగా గణపతి పూజ, సుబ్రహ్మణ్య స్వామి పూజ, అయ్యప్ప పడి పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్వామికి పంచామృతాలు, పండ్లు, పూలు వంటి 18 రకాల వస్తువులతో అభిషేకాలు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ 100 మంది అయ్యప్ప మాలదారులు ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలతో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అయ్యప్ప భజనలు, కీర్తనలతో ఈ ప్రాంతమంతా మారు మోగింది.ఈ పూజా కార్యక్రమంలో సెవెన్ టెంపుల్ చైర్మన్ గండికోట విజయ్ కుమార్, గురుస్వాములు వి.సహదేవ, వరికుప్పల లక్ష్మణ్ (ఆర్టీఏ), గండికోట ఆనంద్ కుమార్, చంద్రమోళి, గండికోట కుమార్, జి.రవితేజ, వి.శ్యామ్, గండికోట ఆనంద్ కుమార్, లక్ష్మణ్, ఎల్లయ్య, ఎ.కృష్ణ, ఎ.గణేష్,స్వాములు నాగరాజు,రామ్ చరణ్,మణి , సాయి, రాము. , నరహరి, సతీష్, శివ ,చింటు, నరహరి,శ్రీను స్వాములు తదితరులున్నారు.


బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలల తరబడి నిర్లక్ష్యానికి గురై అధ్వాన్నంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందికంగా మారి వాహనదారులకు నరకాన్ని చవి చూపించిన నాదర్‌గుల్ ప్రధాన రోడ్డులో చేపట్టిన బిటి ప్యాచ్ వర్క్ పనులను గురువారం పరిశీలిస్తున్న కమిషనర్ సరస్వతి

## రాజగోపురం పనులకు లక్ష రూపాయల వితరణ


చెక్కు అందజేస్తున్న మధురఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి తాము సహకరిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని సౌభాగ్యపురం లోని పవిత్ర క్షేత్రమైన శ్రీఅలివేలుమంగ పద్మావతి గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం కైంకర్యానికి చిలుక మధురఉపేందర్‌రెడ్డి గురువారం లక్ష రూపాయలు చెక్కును దేవాలయం నిర్వాహకులకు అందజేశారు. దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపురం పనులల్లో భాగంగా దశావతారాల నిర్మాణానికి లక్ష రూపాయలను కైంకర్యముగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ చంద్రశేఖర్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, దేవాలయ కమిటీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, వైస్‌ఛైర్మెన్ కె.వి.రమణయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహా పడిపూజ


పడిపూజలు పాల్గొన్న వక్కలంక శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** నల్ల దుస్తులు ధరించి, తులసి మాల ధరించిన అయ్యప్ప స్వామి భక్తులు పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వక్కలంక శ్రీనివాస్‌రావు గురుస్వామి నివాసంలో 42వ మాలధారణ దీక్ష సందర్భంగా అయ్యప్పస్వామి మాహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు పాపిరెడ్డి, సత్యప్రియ, బంధకవి రమణ, శంఖం నాగేష్, గురుస్వాముల నేతృత్వంలో పూజ కార్యక్రమం నిర్వహించారు. రమణగురుస్వామి అయ్యప్ప కీర్తనలు ఆలపించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో శంఖనాదంతో గుర్తింపు పొందిన గంటి నగేష్‌గురుస్వామి తన శాఖ నాదంతో ఒక ఆధ్యాత్మిక ఒరవడిని ప్రదర్శించారు.కార్యక్రమంలో వక్కలంక స్వరూప్‌రాజ్‌స్వామి, శ్రీఖా, సరూర్‌నగర్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బోయిన శంకర్‌యాదవ్, గురుస్వా ములు శర్మ, సూర్యనారాయణ, నాయకి విజయ్‌కుమార్, రాజా స్వామి, హర్షిత్, గోవింద్, ఋషి, నెప్పాలి శశిధర్, వన్నాడీ శ్రీనివాస్, అరవింద్, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలలో రాణించాలి : రజితరెడ్డి


ఉప్పల్ విజయపురికాలనీలో జరిగిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 13 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ విజయపురికాలనీలోని సాయి వికాస్ స్కూల్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్ కార్యాలయాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. క్రీడాకారులకు ప్రభుత్వం తగు గుర్తింపు ఇస్తుందన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, విజయపురి కాలనీ అధ్యక్షులు లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు లింగంపల్లి రామకృష్ణ, వెంకటేష్, అలుగుల అనిల్, సల్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**100 గ్రాముల బంగారం, కిలోన్నర వెండి స్వాధీనం**


వివరాలు వెల్లడిస్తున్న బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్

**సరూర్‌నగర్, నవంబర్ 13 ప్రభాతవార్త:** తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడే అంతర్ రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు ముగ్గురిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుల నుండి రూ.14 లక్షల విలువ చేసే 100 గ్రాముల బంగారు ఆభరణాలు, 1500 గ్రాములు వెండి వస్తువులతో పాటు నిందితులు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్స్‌పెక్టర్ ఎం.సుధాకర్ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం బాలాపూర్ శివాజీ చౌక్ చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అదే సమయంలో పల్సర్ మోటార్ సైకిల్‌పై వచ్చిన నాచారం మల్లాపూర్‌లో నివాసం ఉండే కర్ణాటక రాష్ట్ర బీదర్ టౌన్ మైలూర్ కాలనీకి చెందిన పండ్ల వ్యాపారి కిరణ్ పాటిల్ (25), అదే రాష్ట్రానికి చెందిన బీదర్ బాల్‌భవన్ గార్డెన్ కెహెచ్‌బి కాలనీకి చెందిన క్యాబ్ డ్రైవర్ రాంశెట్టి వత్సల్ (22), బీదర్ జన్వాడ రోడ్ కెహెచ్‌బి కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే అశోక్ మదనా (27)లను ఆపి సోదా చేశారు. ఈ నేపథ్యంలో వారి వద్ద ఉన్న బ్యాగులో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు కనిపించాయి. ఈ మేరకు వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా నిందితులు అంతర్ రాష్ట్ర దోపిడీ దొంగలని తేలింది. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని వారు పకడ్బందీగా చోరీలు చేస్తారని నిర్ధారణ అయ్యింది. వారు వివిధ నేరాల్లో జైళ్లకు కూడా వెళ్ళి వచ్చారని పోలీసుల విచారణలో తెలిసింది. జల్సాల కోసం చోరీలు చేసే వీరు కర్ణాటకతో పాటు రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలాపూర్, జవహర్‌నగర్, మేడిపల్లి తదితర పిఎస్ ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఈ మేరకు నిందితుల వద్ద నుండి బంగారు, వెండి నగలు, వస్తువులతో పాటు బైక్, ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు.